క్లుప్తంగా

ఆండాళ్ ఉత్సవాలు ప్రారంభం


తిరుచ్చి వాహనంలో విహరిస్తున్న ఆండాళ్

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య తెలిపారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలను, అర్చనలను చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాళ్ అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. భక్తుల నుంచి హారతులు అందుకుని ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం నిర్వహించారు.

ఇళ్లస్థలాలు, పట్టాలు ఇవ్వాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న దళితులు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో గురువారం జగనన్న సురక్షపై సర్పంచ్ మోహనప్రియ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తహసీల్దారు శివప్రసాద్ మాట్లాడారు. నంతరం ఎస్సీలు తమకు ఇళ్ల స్థలాలు, పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శి లోకముని, వీఆర్వోలు రవితేజ, బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాససేతుపై గడ్డర్ల అమరిక పూర్తి

- కమిషనర్ హరిత


గడ్డర్ల అమరికను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ హరిత

తిరుపతి మంగళం/ తుడా: తిరుపతి శ్రీనివాససేతు ప్రాజెక్టులో రైల్వే వంతెనపై నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం మిగిలిన రెండు ఐరన్ గడ్డర్లను అమర్చారని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన శ్రీనివాస సేతు పిల్లర్లపై గడ్డర్లు అమర్చే పనులను గురువారం కమిషనర్ పర్యవేక్షించారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ శ్రీనివాససేతు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన గురువారం రెండు గడ్డర్లను అమర్చడంతో మొత్తం ఆరు గడ్డర్లను అమర్చే ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. శ్రీనివాససేతు పూర్తి నిర్మాణం మరో నెల రోజులు పడుతుందని ఆమె తెలిపారు. కమిషనర్ వెంట ఎస్ఈ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్ ప్రతినిధి స్వామి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ ఉన్నారు.

లైటింగ్ ఆకర్షణీయంగా వుండాలి..

తిరుపతి నగరంలోని రైల్వే వంతెనల కింద లైటింగ్ సిస్టమ్ ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. చెన్నై ఫిలిప్స్ ఏజెన్సీ తీసుకొచ్చిన అధునాతన, కలర్స్ ప్రతిబింబించే లైట్ల డెమోను కమిషనర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. అధికారులతో కమిషనర్ హరిత మాట్లాడుతూ రాత్రులందు ఆకర్షణీయమైన లైటింగ్ సిస్టమ్ ప్రజలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. ఫిలిప్స్ ఏజెన్సీ వారు డెమో చూపించిన ఫొసెడ్ లైటింగ్ సిస్టమ్స్ ను పరిశీలిస్తూ తగు నిర్ణయం తీసుకొని లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు త్వరలో ఆమోదం తెలుపుతామని చెప్పారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ డీఈ నరేంద్ర, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

రూ.26 కోట్లతో నూతన భవనానికి భూమి పూజ

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో తరగతి గదులను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో గురువారం రూ.26 కోట్లతో నిర్మించే నూతన భవనానికి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభువు భూమిపూజ చేశారు. నాడు - నేడు పథకం కింద ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగానే వైద్య విద్యార్థులకు అవసరమైన ఆధునిక తరగతి గదులను నిర్మించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధిరెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వసుంధరాదేవి, ఏపీ ఎం ఎస్ఐడీసీ ఈఈ లక్ష్మీపతిరెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ రమణమూర్తి పాల్గొన్నారు.

సేవకు సలాం



చెంచయ్య దంపతుల దుకాణం వద్ద ఉన్న వలంటీర్ దివ్య (ఫైల్)

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు సచివాలయ, గ్రామ వలంటీర్ల వ్యవస్థలకు ఏర్పాటుకు చేసింది. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ వలంటీర్లు ఎనలేని సేవందిస్తున్నారు. ప్రత్యేకించి, కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేస్తున్న అప్పటి పరిస్థితులలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోగుల ఇళ్లకు వెళ్లి వారి అవసరాలను తీర్చారు. గొప్ప సదాశయంతో తెచ్చిన ఈ వ్యవస్థపై ఇప్పుడు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల ఆందోళన కొనసాగుతోంది. అయినా పవన్ మాత్రం పదే పదే మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ మరింత ఆజ్యం పోస్తున్నారని ప్రజానీకం కూడా మండిపడుతోంది. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలపై కథనం. –సత్యవేడు

‘దివ్య’మైన సేవలతో పునర్జన్మ



నాపేరు వందన. నా వయసు 40 ఏళ్లు. సత్యవేడు నేతాజీ రోడ్డులో నేను, మా ఆయన చెంచయ్య(45) కలసి కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాం. ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు చేశాం. ఎవరి బతుకులు వాళ్లు బతుకుతున్నారు. 2019లో నాకు, మా ఆయనకు ఒకేసారి కరోనా వచ్చింది. పేపర్లు, టీవీలలో కరోనా గురించి వచ్చే వార్తలు చూసి భయపడిపోయాం. అప్పుడు మమ్మల్ని తిరుపతి క్వారంటైన్ సెంటర్‌కు తీసుకెళ్లారు. అక్కడ నాకు 7రోజులు, మా ఆయనకు 8రోజులు ట్రీట్‌మెంట్ వచ్చారు. మందులు ఇచ్చి ఇంటికి పంపారు. ఆ టైంలో ఇరుగుపొరుగు వాళ్లే కాదు; మా దగ్గరకు బంధువులు కూడా రాలేదు. ప్రాణం విలువ, జీవితం విలువ అంటే ఏమిటో కరోనాతో అందరికీ తెలిసొచ్చింది. ఇలాంటి పరిస్థితి పగవాడికి కూడా వద్దు దేవుడా! అని మొక్కుకున్నా. క్వారంటైన్ నుంచి ఇంటికొచ్చిన మాకు ఏం భయపడొద్దు ఆంటీ– అని 4వ వార్డు వలంటీర్ పి.దివ్య ధైర్యం చెప్పింది. మాకు సేవలు అందించింది. ఇల్లు, వాకిట బ్లీచింగ్ చల్లేది. వేడినీళ్లు కాచి ఇచ్చేది. క్రమం తప్పకుండా మందులు ఇచ్చి వెళ్లేది. తినేందుకు కావాల్సిన ఇడ్లీ, చపాతి, పండ్లు..ఇలా అన్నీ తెచ్చిచ్చేది. ఎవరూ మా ఇంటి పక్కకు రాకున్నా నెల రోజులు ఆ బిడ్డ (దివ్య) సేవలు చేసింది. ఏ జన్మ బంధమో..రుణమో అనుకున్నా..! ఈరోజు మేం బతికున్నాం ఇద్దరే కారణం..క్వారంటైన్ సెంటర్‌లో డాక్టర్లు ప్రాణం నిలబెడితే, ఇంటికొచ్చాక మేము నిలదొక్కుకునే ధైర్యం ఇచ్చింది, మనుషులుగా మమ్మల్ని నిలబెట్టింది దీపనే!

రెడ్‌జోన్‌లో ధైర్యంగా సేవలు

సత్యవేడుకు చెందిన చెంచయ్య, అతని భార్య వందనను తిరుపతి క్వారంటైన్ నుంచి సత్యవేడుకు తీసుకొచ్చారని ఏఎన్ఎం చెప్పింది. వారికి అవసరమైన సేవలు అందించాలని కోరింది. రెడ్‌జోన్ ఏరియాలోని వారి ఇంటికి వెళ్లడానికి భయపడుతుంటే నేను ఎస్ఐ సాయంతో వెళ్లాను. వారు అప్పుడు నిద్రపోతున్నారు. నాకు గ్లౌజ్, మాస్క్‌లను ఇచ్చి ఉండడంతో వాటిని తొడుగుకుని వారిని నిద్ర లేపాను. ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నా. నెల పాటు వారి ఇంటికి రోజూ వెళ్లి మందులు ఇచ్చేదాన్ని. అప్పట్లో ఇక్కడ హాస్పిటల్‌లోని కరోనా బాధితులకు ప్రభుత్వం ఉచితంగా టిఫిన్, రెండు పూటలా భోజనం అందే ఏర్పాట్లు చేసింది. ఆస్పత్రికి దగ్గరలో ఒక హోటల్‌కు మాత్రమే పర్మిషన్ ఇవ్వడంతో అక్కడి నుంచి రోగులకు సప్లయ్ చేసేవారు. నేను ఆ హోటల్ నుంచి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి పూట భోజనం తెచ్చి వారికి ఇచ్చేదానిని. కొన్ని రోజులకు వారిద్దరూ కోలుకున్నారు. సత్యవేడులో క్రమేణా కరోనా తగ్గడంతో వారు మళ్లీ కూరగాయలు వ్యాపారం ప్రారంభించారు. కొన్నిరోజుల పాటు వారికి అంగట్లో సాయంగా కూడా ఉన్నా.

వలంటీర్ సాయం వల్లే పింఛన్



2019లో నా భర్తకు పింఛన్‌కు అర్హత రావడంతో ఈకేవైసీ చేయాల్సి వచ్చింది. అప్పుడు పక్షవాతంతో బాధపడుతున్న మా ఆయనను తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్పించి అక్కడే ఉన్నా. రామ్ నగర్‌లోని వలంటీర్ వి.రాజేశ్వరి మా అడ్రస్ తెలుసుకుని, సొంత ఖర్చుతో రుయా ఆస్పత్రికి వచ్చింది. వేలి ముద్రలు తీసుకుంది. దీంతో మా ఆయనకు పింఛను వచ్చింది. రాజన్న కొడుకు జగన్ పింఛన్ పెంచడం వల్ల నేను ఆయనకు నెల నెలా మందులు కొనగలుగుతున్నా. వలంటీరు ప్రతి నెలా పొద్దున్నే ఆరు గంటలకే ఇంటికాడికి వచ్చి పింఛను ఇస్తాంది. ఆ రోజు వలంటీర్ చేసిన సాయం వల్లే ఇప్పటికీ నాకు చాలా ఉపయోగపడుతోంది. ఆ వలంటీర్‌ను నా బిడ్డగా భావిస్తున్నా. –డి.నాగమ్మ, సత్యవేడు

వలంటీర్ల నిరసన



ఏర్పేడులో ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

- పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్

ఏర్పేడు: కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించిన వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అనుచిత చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఏర్పేడులో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక సచివాలయం నుంచి శ్రీకాళహస్తి, తిరుపతి ప్రధాన రహదారిపై అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ నుంచి దివంగతనేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ చేశారు. పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కేంద్ర సాంస్కృతిక శాఖ అదనపు కార్యదర్శి కె.రాజస్‌చోప్రా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

లీకేజీ మరమ్మతులకు సహకారం

కేంద్ర సాంస్కృతిక శాఖ అదనపు కార్యదర్శి రాజస్‌చోప్రా దృష్టికి పాలక మండలి చైర్మన్ ఆలయ పైభాగంలో లీకేజీ విషయాని తీసుకువచ్చారు. రూ.3.5కోట్లు ఖర్చు అవుతుందని నివేదించారు. దీనికి తమవంతు సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామారావు, ఆలయ అధికారులు వేదపండితులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయవంతం కావాలని..

ఇక శుక్రవారం ఇస్రో నుంచి చంద్రయాన్ రాకెట్ ప్రయోగం నేపథ్యంలో ఇస్రో స్పేస్ కమిషన్ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రయోగం విజయవంతం కావాలని పూజలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురంలో లోఓల్టేజి సమస్య పరిష్కరించేందుకు అదనంగా ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్ రావు, ట్రాన్స్‌కో ఏఈ వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సులభ రీతిలో ఇంగ్లిష్ బోధన


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

ఏర్పేడు: విద్యార్థులకు ఇంగ్లిష్‌ను సులభ రీతిలో బోధించాలని ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని బండారుపల్లె జెడ్పీ హైస్కూలులో నిర్వహించిన సీఆర్‌సీఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఇంగ్లిష్‌పై విద్యార్థులు పట్టు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు.

కిశోర బాలికలకు వ్యాక్సిన్లు


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ డాక్టర్ శిల్ప ఆధ్వర్యంలో కిశోర బాలికలకు టీడీ(టెటానియా డిఫ్తీరియా) వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. 16 ఏళ్లలోపు 50 మంది విద్యార్థినులకు ధనుర్వాతం, డిఫ్తీరియా నివారణకు వ్యాక్సిన్లు వేశారు. కిశోర బాలికలు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఐరన్ మాత్రలు, వ్యాక్సిన్ ఉపయోగాలు, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అన్నపూర్ణ, సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఏడుగురి ఎంపిక


దీపిక


జ్ఞానప్రసూన


జ్యోత్స్న


ప్రేమ్‌కుమార్


సురేఖ


ప్రపూర్ణ


త్రివేణి

నారాయణవనం/బుచ్చినాయుడుకండ్రిగ/పిచ్చాటూరు: నారాయణవనం, బుచ్చినాయుడుకండ్రిగ, పిచ్చాటూరు మండలాలకు చెందిన ఏడుగురు విద్యార్థినీ విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఎంఈఓలు, హెచ్ఎంలు చెప్పారు. నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి దీపిక, పాలమంగళం ఉన్నత పాఠశాల విద్యార్థినులు జ్యోత్స్న, జ్ఞానప్రసూన, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రేమ్‌కుమార్, బుచ్చినాయుడుకండ్రిగ మండలం గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన సురేఖ (శ్రీనివాసతేజ స్కూల్ విద్యార్థిని), పిచ్చాటూరు మండలం రజానగరంలోని జెడ్పీ హైస్కూలు విద్యార్థిని ఏ.ప్రపూర్ణ, నీరువాయి దళితవాడకు చెందిన ఏ.త్రివేణి (శ్రీకాళహస్తి గురుకుల పాఠశాలలో చదివింది) ప్రతిభ చాటి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిని నారాయణవనం ఎంఈఓ–1 ప్రభాకర్‌రాజు, ఎంఈఓ–2 గోవిందస్వామి, హెచ్ఎం శశికళ, మనోహరి, సులోచన, కరస్పాండెంట్ కె.సుధాకర్, రజానగరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎన్.వాసు, టీచర్లు అభినందించారు.

ఏర్పేడు మండలం నుంచి..


హేమలత

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థిని చల్లా హేమలత ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ తెలిపారు. విద్యార్థినిని ఎంఈఓ ప్రేమలత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం ప్రారంభం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం గురువారం వేడుకగా ప్రారంభమైంది. ఈ ఉత్సవం ఈనెల 22వ తేదీ వరకు జరగనుంది. ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారికి ఏకాదశి తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం సమర్పణ నిర్వహించారు. తర్వాత శ్రీఆండాళ్ అమ్మవారిని జీఎస్ మాడ వీధి, గాంధీ రోడ్డు మీదుగా గంగుండ్ర మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహించారు.

సిపాయి భరోసా పంపిణీ


నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి ఎస్సీ కాలనీకి చెందిన కుక్క రమణయ్య(58) ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గురువారం పరామర్శించారు. మృతుడి కుమారుడు జగదీష్‌కు సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు దశరథ రామిరెడ్డి, కందాటి ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

- ‘జగనన్న సురక్ష’ శిబిరాల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


నాగలాపురం మండలం టీపీ కోటలో.., సత్యవేడు : రాజగోపాలపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే




పిచ్చాటూరు : కీళపూడిలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధిని అందివ్వాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం నారాయణవనం–1 సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరాన్ని ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. లబ్ధిదారులకు ధృవపత్రాలు పంపిణీ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. జగనన్న సురక్షలో 11 సేవలను ఉచితంగా అందివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలను మండలంలోని అధికారులు బేఖాతరు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ఆదాయ, కుల ధృవపత్రాలను మాత్రమే జారీ చేసి చేతులు దులుపుకోవడం సరి కాదన్నారు. నియోజకవర్గంలోనే సొంత మండలమైన నారాయణవనం చివరి స్థానానికి పడిపోవడంపై ఆయన అధికారులను ప్రశ్నించారు. ప్రజల నుంచి అందిన వినతి పత్రాలను పరిశీలించి, అవసరమైన వారికి వ్యక్తిగత పత్రాలను కూడా జారీ చేయకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, పార్టీ కన్వీనర్ సొరకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, సింగిల్‌విండో చైర్మన్ ఊరప్ప, ఏకాంబరం, చిన్నదొరై, మండల స్థాయి అధికారులు సర్పంచులు ధర్మలింగం, సుబ్రమణ్యంరెడ్డి, రామ్మూర్తి, ఎంపీటీసీలు రవి, పొన్నుస్వామి, ఎంపీడీఓ గుణశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దామోదరనాయుడు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

కీళపూడిలో..

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి సచివాలయ పరిధిలో గురువారం మధ్యాహ్నం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా మొత్తం 686 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఇందులో కులం 332, ఆదాయం 307, మ్యుటేషన్ 6, రేషన్ కార్డు 10, స్ప్లిట్టింగ్ 18, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ 7, ఓబీసీ సర్టిఫికెట్ 5, కౌలు రైతు సర్టిఫికెట్ 1 చొప్పున ఇచ్చిన ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. అలాగే కీళపూడి చెందిన జ్యోతిక, హేమంత్‌లకు కళ్యాణమస్తు పథకం కింద రూ.50 వేలు మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. తహసీల్దార్ మధుసూదన్ రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ సునంద, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దామోదర్ నాయుడు, సర్పంచ్ కల్పన, అన్నాదురై, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, నాయకులు చలరాజు, శేఖర్ రెడ్డి, చెంగల్రాయ రెడ్డి, పాల్గొన్నారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం మండలం టీపీ కోట సచివాలయంలో గురువారం మొత్తం 704 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ పద్మజ తెలిపారు. ఇందులో 298 కులం, 298 ఆదాయం, 86 కొత్త రేషన్ కార్డులు, 23 రేషన్ కార్డు స్ప్లిట్టింగ్, 3 మ్యుటేషన్ సర్టిఫికెట్లు ఉన్నట్లు ఆమె వివరించారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సింగిల్ విండో డైరెక్టర్ షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, అలగేశన్, సర్పంచులు పయణి, సక్కుబాయ్, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ చైర్మన్ ఎస్ఎం సురేష్ ఎంపీటీసీ రఘు, సచివాలయ కన్వీనర్లు పయణి, మహేష్ రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు మండలంలో..

సత్యవేడు: మండలంలోని కన్నావరంలో 433 మందికి, రాజగోపాలపురంలో 674 మందికి సర్టిఫికెట్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేసి మాట్లాడారు. రాజగోపాలపురం, వానెల్లూరు గ్రామాల పరిధిలో 1,024 మందికి వివిధ పథకాల రూపేణా రూ.13.1 కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

రాజగోపాలపురం సచివాలయ పరిధిలో పంచాయతీ వీధి, పడమర వీధుల మలుపుల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో కల్వర్టులు నిర్మించాలని కోరారు. అరుంధతి వాడలో మురుగు కాలువలు నిర్మించాలని, దళితవాడ శ్మశానానికి రోడ్డు వేయాలని, నాగారపు గుడి సమీపం నుంచి పొలాలకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించాలని రైతులు కోరారు. వానెల్లూరు గ్రామస్తులు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బొప్పన సోమశేఖర్, సర్పంచులు మధుసూదన్‌రావు, జయంతి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.


వరదయ్యపాలెం : పెద్ద పాండూరులో..


బుచ్చినాయుడుకండ్రిగ: కంచనపుత్తూరులో..

పెద్దపాండూరులో..

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో గురువారం జగనన్న సురక్ష నిర్వహించారు. వివిధ ధృవ పత్రాల కోసం 1054 మంది దరఖాస్తు చేసుకోగా 997 మందికి ధృవ పత్రాలను అందజేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నాతో పాటు పలువురు మాట్లాడారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరిశంకరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, ఎంఎల్ఓ ప్రసాద్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, స్థానిక సర్పంచులు కవిత, రమ, ఎంపీటీసీ అంకమ్మ, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, కంచనపుత్తూరు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహరావు, తహసీల్దారు భార్గవి లబ్ధిదారులకు ధృవ పత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మణి నాయుడు, లక్ష్మీపతిరెడ్డి, వ్యవసాయాధికారిణి భారతి, సర్పంచ్ స్వప్న, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

1,600 మందికి సర్టిఫికెట్లు పంపిణీ


పవనివారికండ్రిగలో సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈఓ, ప్రజాప్రతినిధులు

కేవీబీపురం: మండలంలోని సదాశివపురం, పవనివారి కండ్రిగ సచివాలయ పరిధిలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. 1,600మంది అర్జీదారులకు వివిధ సర్టిఫికెట్లు ను డీఈఓతోపాటు పార్టీ మండల కన్వీనర్ కృష్ణయ్య తదితరులు అందజేసి మాట్లాడారు. ఎంపీడీఓ రామచంద్ర, ముఖ్యనేతలు నందకుమార్, లాలుబాబుయాదవ్, మునిరాజా, మునీంద్ర, ఎంపీటీసీ జ్యోతి, సర్పంచ్ చెంచు ప్రకాష్‌యాదవ్, సచివాలయ కన్వీనర్ భూపతి, వెంకటరత్నం, బాలయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.